# శ్రీసన్నిధానం

సంపుటి 1 సంచిక 11

సెప్టెంబర్ 2022



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం -

4. భాద్రపదం-భాగ్యప్రదం

5. మన దేవాలయాలు

6. రామానుజ సుధామాధురి -దర్శనం - నిదర్శనం

7. మనసులోని మాట

8. విదేశాలకు వెళ్ళినా...

9. ఆధ్యాత్మిక వార్తలు

11. బాలవిజ్ఞానం - శమీకముని సహనం-దయాగుణం

12. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి — చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద — ఓపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి — మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

తెలంగాణ రాష్ట్రంలో జరుపుకొనే పండగ బతుకమ్మ, పూల పండుగ, గౌరీ దేవి పండుగ. మహాలయ అమావాస్య నుంచి దుర్గాష్టమి వరకు ఈ పండుగ 9 రోజులు జరుపుకోవడం సంప్రదాయం. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. రంగు రంగుల పూలను పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ, జానపదాలు, పాటలు పాడుతూ వలయంగా తిరుగుతూ పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మగా వివిధ పేర్లతో వ్యవహరిస్తారు. ఇలా దేని ప్రత్యేకత దానిదే. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో, చెరువులు, నదులలో చివర అంపుతారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు తెలియజెప్పే భావజాలం పాటలతో గానంచేస్తారు. బతుకమ్మ సంప్రదాయం క్రమంగా ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించింది. దేశవిదేశాలలో సైతం పండుగ వేడుకగా జరుపుకుంటున్నారు. రోజూ ఓ రకమైన నైవేద్యం సమర్పిస్తూ, మొదటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ, ఆతరువాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, చివరిరోజు సద్దుల బతుకమ్మ పేర్లతో పిలుస్తారు.


**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 0878 2933323; 9502583323;



నోట్:- సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

## లోపం ఎక్కడఉంది?! కనువిప్పు కలిగేదెప్పుడు

సంప్రదాయ ఆచరణలో లోపం ఎక్కడఉంది?! ఎందుకు విమర్శలు వస్తున్నాయి. ఎందుకు తప్పుదారి పడుతున్నాము?! మనం ఒక్క క్షణం ప్రశ్నించుకుంటే సమాధానాలు ముందు వరుసగా నిలుస్తాయి. కర్తవ్య నిరతిని పాటించినప్పుడే ప్రగతి పథంలో పయనించడానికి మార్గాలు సుగమం అవుతాయి.

మనం నడుస్తున్న మార్గం సరైనదని భావించినప్పుడు బెరుకు పడాల్సిన అవసరం లేదు. ఎవరో ఏదో అనుకుంటారని అనుకుని జంకవలసినపనిలేదు. హిందూ సమాజం కట్టుబొట్టు, జుట్టు వదిలేసారని అలా వదిలేయమని చెప్పామా అంటూ ఇటీవల సామాజిక మాధ్యమాలలో పోస్టులు కలవర పెడుతున్నాయి, ఇలాంటి పోస్టులగురించి కాస్త ఆలోచించాల్సి అవసరం అవశ్యకత ఎంతైనా ఉంది. అదేవిధంగా పండుగలు వేడుకల సందర్భంగా మన చేస్తున్న దేమిటీ, యువత తప్పుదారి పడుతుంటే పెద్దలు నచ్చజెప్పాల్సి అవసరం లేదా?! ఉదాహరణానికి నవరాత్రి ఉత్సవాల సమయంలో వేదికలు ఏర్పాటు చేయడం బాగుంది కానీ, అక్కడ నిర్వహించే కార్యక్రమాలే కాస్త పక్కదారి పడుతున్నాయి. సౌండ్ బాక్సులు, డిజెలతో ప్రారంభించి ఏకంగా రికార్డు డ్యాన్సులే చేస్తున్నారు. సంప్రదాయ నృత్య రీతులకు తావులేకుండా సినీ వినోదానికే ప్రాధాన్యం పెరుగుతోంది. దీనివల్ల నడవడిక, అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. మనం ఎక్కువ సమయం వెచ్చిస్తున్న సమయం చాలా విలువైనది అని గ్రహించడం లేదు. ఈ క్షణం గడిస్తే చాలు అని కాసేపు కళ్లుమూసుకోవడం సరికాదు. దీని వల్ల భావితరాలవారికి సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని ఆలోచించే వారెందరు మీలో ఉన్నారు. ఒక మారు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం వచ్చింది.

సాంప్రదాయ నృత్యం, బుర్రకథలు, జానపదాలు జనం నుంచి దూరంగా వెళుతున్నాయి. పురాణాలు సప్తాహాలు కొన్ని వేదికలకే పరిమితమై పోయాయి. రెండు గంటలు నడిచే వెండితెర చిత్రాలు అప్పటికవి ఆ క్షణానికి వినోదాన్ని అందించేవే కాదనలేం కానీ ఆనడవడికను జీవితంలో జొప్పించాలని చూస్తున్న తీరు మాత్రం సిగ్గుపడేలా ఉంది. శృంగార గీతాలు, వయ్యారాలను ఒలకబోసే నృత్యాలు, పాటలు మనం పూజించడానికి ఏర్పాటు చేసిన మంటపాల వేదికపై కనిపించడం సిగ్గుపడాల్సినదే. పెడదారిని పడుతున్న పరిస్థితులను చక్కదిద్దాల్సినది ఎవరు? మనకు ఎవరో ఒకరు చెప్పాలా?! ఏది మంచి ఏది చెడూ అని ఒకరు చెపితే వినే అజ్ఞానంలో ఉన్నామాఅని తెలుసుకోవాల్సిన అవసరం వచ్చింది. ఇళ్లల్లో పూజించే దేవతలను మనలో ఐకమత్యం పెంపొందించడానికి స్వాతంత్ర్య సమర సమయంలో లోకమాన్య బాలగంగాధర్ లాంటి పెద్దలు ఆచరించి ఆచరణ మార్గం చూపారు. కానీ మనం ఈ నాడు చేస్తున్న దేమిటీ. అని ప్రశ్నించుకోవాల్సిన అవసరం వచ్చింది. మళ్లీ సంస్కరణలను తీసుకు రావాల్సిన అవసరం వచ్చింది. కలిసి నడుద్దాం ప్రగతిని సాధిద్దాం. పండుగ వేడుకలను అపహాస్యం చేయకుండా ముందుకు నడుద్దాం. స్వాతంత్రానంతరం మన సంస్కృతిపై పరోక్ష ప్రత్యక్ష దాడులు జరుగుతున్నాయన్నది జగమెరిగిన సత్యం. మన పండుగను మనం జరుపుకునే స్వాతంత్ర్య కోల్పోతున్నామన్న విషయాన్ని మన గ్రహించగలిగితే, కనువిప్పు కలుగుతుంది. ఆలస్యం అమృతం విషం.

– చీఫ్ ఎడిటర్

# -: భాద్రపదం- భాగ్య ప్రదం :-

అవసరాలు, ఆవశ్యకత పైననే మన జీవనవిధానం ఆధారపడి ఉంటుంది. మనం చేసే ధార్మిక క్రియ ఆచరణల వల్లనే సకల నియామకుడు అయిన భగవంతుడు, లోకరక్షకులైన దేవతలు, శుభాశీస్సులు ప్రసాదించే పితరులు సత్ఫలాలను ఇస్తారని పెద్దల మాట!.

మానవుడు ఈ భూమియందు జ్ఞాన, సంకల్ప, క్రియా శీలి. కనుక తన జీవన ఆనందమే కాకుండా తోటి మానవుల గురించి శుభకామనలతో జీవించాలి. అదే సమయంలో ప్రకృతి సంరక్షణ జీవవైవిధ్య సామరస్యత కలిగి ఉండాలి. ఈ సమతౌల్యం లోపించకుండా ఉండడానికి మన పెద్దలు అనేక శుభప్రదమైన సంస్కృతి ఆచరణలు, పండుగలు ఏర్పరిచారు. కర్మాచరణ లో తెలిసి తెలియక మనం చేసే క్రియలే దోషాలు గా పరిణమించి శుభాలకు అడ్డంకులు అవుతాయి. అది తొలగించుకోవడానికి భాద్రపద మాసం ప్రత్యేక ముహూర్తాలను అందించింది. మన పెద్దలు ఆచరణ విధిని సూచించారు. వాటిని ఆచరించటం ద్వారా భాద్రపదం భాగ్య ప్రదమవుతున్నది.





భాద్రపద మాసం ప్రథమ పక్షంలో దేవతారాధనలు ద్వితీయ పక్షంలో పితృదేవతలకు పూజలు నిర్దేశించబడినాయి. అందుకే పితృ పక్షాలు అనే బహుళతిథులను పేర్కొంటారు. ఈ మాసాల్లో దశావతారాల్లో ప్రధానులై సృష్టిని, దేవతా స్థితిని కాపాడిన వరాహమూర్తి, వామనమూర్తి అవతరించారు. అందుకే దశావతార వ్రత పూజ ఈ మాసంలో ప్రధానమైనది. అలాగే ఈ మాసం అనంత పద్మనాభ చతుర్దశి వ్రతం ఆచరిస్తారు. మాస ప్రారంభంలోనే జరుపుకునే మహోత్సవం వినాయక చవితి అలాగే ఋషిపంచమి మహాలయ అమావాస్యభాద్రపద మాసంలోనే! తెలంగాణ ప్రాంతాల్లో చిన్న బతుకమ్మగా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభిస్తారు. వర్షఋతువులో రెండో మాసం కనుక శరదృతువు లక్షణాలు కూడా కలిగి ఉంటుంది ఈ మాసం. మొలకెత్తిన ఔషధ మొక్కలు ఆకులు పుష్పించి ఔషధగుణాలు సంతరించుకుంటాయి. వాటి ఆరోగ్య పరత్వాన్ని పురస్కరించుకుని పెద్దలు 21 పత్రాలతో పూజను నిర్దేశించారు పువ్వులతో బతుకమ్మ సంప్రదాయాన్ని నెలకొల్పారు.

భాద్రపద విదియ కల్కి జయంతి తృతీయ హరితాక వ్రతం చేస్తారు. అరటి స్తంభాలతో మంటపం ఏర్పరచి పూజా విధి తో అర్చించి ఉపవాసం చేసి మరునాడు ఉద్యాపన చేస్తారు. ఈరోజు ఉండ్రాళ్ళతద్దిగా మరికొందరు పిలుస్తారు. గణేశ చతుర్థి గొప్ప వైభవమైన పండుగ విఘ్ననివారణా ప్రాధాన్యంతో ఈ సంప్రదాయాన్ని అనుసరించి విశ్వక్సేనపూజ, వినాయకపూజ చేస్తారు. విఘ్నేశ ఆరాధనగా వినాయక నవరాత్రులు ప్రారంభమవుతాయి. పంచమినాడు ఋషిపంచమి వ్రతాచరణము షష్టినాడు సూర్యపూజ, మరియు మంథాలషష్టి, దేవీషష్టి అని కూడా పిలుస్తారు. సప్తమి అనంత ఫలసప్తమి అని అపరాజిత సప్తమి అని పిలుస్తారు. ఆరోజు ముక్తా భరణ వ్రతం అని లలితా దేవికి అలంకార పూజ చేస్తారు. శుక్ల అష్టమిన కొన్ని ప్రాంతాల్లో మహాలక్ష్మి రాకగా సాయం వేళ ఒక ఆచారాన్ని పాటిస్తారు. బొమ్మ రాళ్లను బావి వద్ద పూజించి శబ్దం చేస్తూ ఇంట్లో ప్రవేశించి ఆ రాళ్లను ఆరాధించి నైవేద్యం సమర్పిస్తారు. అష్టమి రాధాదేవి శ్రీకృష్ణుని పొందిన దినంగా రాధాష్టమి అని జరుపుకుంటారు. నందానవమి అని దుర్గా ఆరాధన చేస్తారు. దశమి నాడు దశావతార వ్రతం, ఏకాదశిని వామనైకాదశి పరివర్తన ఏకాదశి అని అంటారు. శయనఏకాదశికి మాసం రోజుల్లో భగవంతుడు పక్కకు ఒత్తిగిలి నట్లుగా భావిస్తారు. ద్వాదశి వామన జయంతిని, బలిబంధనం అని రక్షలు కొట్టుకోవడం ఆచరిస్తారు.చతుర్దశి అనంతపద్మనాభ వ్రతం ఆచరిస్తారు. పూర్ణిమనాడు శ్రావణ పూర్ణిమనాడు వీలుకాని వ్రతాలను ఈరోజు ఆచరిస్తారు. ఈనాడు చేసే దానం ఫలప్రదం అని పెద్దలు చెప్తారు. బహుళ పాడ్యమి నుండి మహాలయ పక్షారంభం. (పితృ పక్షాలు) పితృ పక్షాలు లో పితృ దేవతా పూజలు తర్పణాలు ఆచరిస్తారు. శ్రాద్ధ ఆచరణలోని లోపాలు దోషాలు పితృ పక్ష ఆచరణలో నశిస్తాయి. అని భావిస్తారు. ఈ పదిహేను రోజులు శుభ కార్యాలు జరపరు! బహుళ తదియ రోజు ఉండ్రాళ్ల తదియ. పంచమి నాగపూజ అష్టమి జీమూతవాహన పూజ. దుర్గా పూజ ఆచరిస్తారు. ఏకాదశిని ఇందిర ఏకాదశి అని చెప్తారు. అమావాస్య తిథి మహాలయ అమావాస్యగా పితృదేవతారాధనలు చేస్తారు. తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ ప్రథమ దినంగా పూలతో బతుకమ్మను పసుపుతో గౌరమ్మను చేసి పూజిస్తారు. విఘ్న నివారణ పూజలతో ప్రారంభమై మంగళప్రదమైన బతుకమ్మ ప్రారంభదినంతో ముగిసే భాద్రపదం మన దోషాలను హరించి వేసి సమస్త భాగ్యాలను ప్రసాదిస్తుంది.

# కోటివరాల వేల్పు కొండపలకల స్వామి



## మన దేవాలయాలు

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం కొండపలకల గ్రామంలో స్వయంభువుగా గుట్టపై వెలసిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం. మొదట కొమురయ్య అనే వ్యక్తికి రామచంద్ర స్వామి వారు కలలో కనబడి కొండపై స్వయంగా నేను వెలిశాను అక్కడ గుడి కట్టించండి అని చెప్పినారట. తెల్లవారి ఊరి ప్రజలును తీసుకొని వెళ్ళి చూసేసరికి శ్రీ సీతారామచంద్ర స్వామివారు, లక్ష్మణ పెరుమాళ్ళు సీతమ్మవారు, ఆంజనేయ స్వామి కొండ గుహలో దర్శనమిచ్చారు. అప్పటినుండి గుహ మీద గోపురం నిర్మించి కార్యక్రమాలు నిర్వహించేవారు. కొండ పక్కన ఉన్న ఊరు కాబట్టి దానిని కొండపలకలగా వ్యవహరించారు. కొండపైన మల్లికార్జున స్వామి వారి దేవాలయం కూడా ఉంది కొన్ని సంవత్సరాల తర్వాత ఊరి ప్రజల సహకారంతో కాంతాల మల్లారెడ్డి గారు దేవాలయ నిర్మాణం చేశారు. ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి ఉత్సవాలు జరిపించారు. కొన్ని రోజుల తర్వాత రంగారావు గారు భూమి తవ్వుచుండగా దశావతారములతో కూడిన చెన్నకేశవ స్వామి విగ్రహం కాకతీయుల కాలం నాటిది బయటపడింది. పండితులు పెద్దలు అందరూ కలిసి ఊరిలో ఉన్న ఆలయంలో ధ్రువ మూర్తిగా ప్రతిష్ఠించారు. అప్పటినుండి ఊరిలో ఉన్న ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దాదాపు వంద సంవత్సరములపై నుండి ఆలయ పూజారులుగా నమిలకొండ వంశస్థులు వెంకటాచార్యులు, సింహాచార్యులు, రామాచార్యులు పూజాది కార్యక్రమాలు కొనసాగించారు. తర్వాత వంశపారంపర్యంగా సింహాచార్యుల కుమారులు శ్రీమాన్ నమిలకొండ రంగాచార్యులు గారు 2004 వరకు పూజారిగా ఉన్నారు. వారి తదనంతరం వారి కుమారులు నమిలకొండ రఘురామాచార్యులు గత 18 సంవత్సరాలుగా ఆలయ పూజారిగా కొనసాగుతున్నారు. ఇక్కడ ఆది వరాహ స్వామి, నరసింహ స్వామి, కాలభైరవ స్వామి, అనంత నాగేంద్రస్వామి ఉపాలయాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి వసంత నవరాత్రులు నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. శ్రీరామనవమి రోజు కళ్యాణం జరుగుతుంది. చైత్రశుద్ధ పౌర్ణమి రోజు నుండి మూడు రోజుల జాతర జరుగుతుంది. బండ్లు (శకటోత్సవం), రథోత్సవం కూడా ఉంటుంది. ధనుర్మాస ఉత్సవాలు నెలరోజులు జరుగుతాయి. ఆలయం సమీపంలో



ఆంజనేయ స్వామి దక్షిణముఖుడై వేంచేసి ఉన్నాడు. కోరికలు కోరిన వెంటనే నెరవేరుతాయని నమ్మకం. ఆ విధంగా ఆలయం దినదినాభివృద్ధిగా అభివృద్ధి చెందుతుంది. శ్రావణమాసంలో కొండపైకి వనభోజనాలకు వస్తారు. ఆ ప్రదేశం చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. ఆధ్యాత్మిక ప్రదేశమే కాకుండా విహారస్థలంగా అభివృద్ధి చెందింది. ఇది తప్పకుండా దర్శించుకోవలసిన ప్రదేశం.







# శ్రీరామానుజ సుధామాధురి

# దర్శనం - నిదర్శనం



**భారతీయ సంస్కృతిలో ఆచార్యులదే గొప్ప స్థానం! ఎందుకంటే "ఆచార్యవాన్ పురుషో వేద" అని ఆచార్యులు కలిగినవారే అన్నింటిని తెలుసుకోగలుగుతారు. మనం తెలుసుకోవలసిన పరమార్థం కూడా ఆచార్యుల వల్లనే తెలుస్తుంది. లౌకిక విషయాలలో కూడా గురువుల ప్రభావంతోనే విద్యాభివృద్ధి కలుగుతుంది. అన్నీ కలిగి ఉండి ఎన్నో అనుభవాలతో మరెన్నో సంక్లిష్ట అంశాలలో పరిజ్ఞానం సాధించి ఉన్నప్పటికీ భగవత్ సంబంధిత జ్ఞానము లేనిదైన విజ్ఞానం నిస్సారం నిరుపయోగం అని పెద్దలు చెప్తారు. ఉజ్జీవింప చేయు భావ సంపదను కర్తవ్య స్ఫూర్తిని మనకందించె వారే ఆచార్యులు. పువ్వు పువ్వున తేనెను సేకరించి తెట్టెగా ఒకచోట పెట్టితే అది ఓషధి భూతంగా అమృత మాధురి సమకూర్చినట్టుగా తత్వజ్ఞాన సంపన్నులైన ఆచార్యులు సమాజానికి హితోక్తులను ఉద్బోధించారు. అటువంటి ఆచార్యుల లోనే ప్రధాన ఆచార్యరత్నం భగవద్ రామానుజా చార్యులు. 120 సంవత్సరాలు సమకాలీనులకు దర్శనం ప్రసాదించి ధన్యులను గావించారు. వేల సంవత్సరాల వరకు అనుసరణీయమయిన రామానుజ దర్శనాన్ని ఉద్బోధించారు. ఎన్నో ఒడిదుడుకులకు ఓర్చి సాంప్రదాయాన్ని ఉద్ధరించారు. అంతటి సుదీర్ఘ జీవితం ధార పోసినా అది సరిపోక భగవదాజ్ఞ చేత తిరిగి మనవాళ మహామునులుగా అవతరించారు. శ్రీసాంప్రదాయ ఉపదేశ వాంగ్మయాన్ని ప్రపన్న లోకానికి ప్రసాదించారు అని పెద్దలమాట!**



జగదాచార్యుల సమకాలీన శిష్య పరంపరలోని వారే కాకుండా తదనంతర ఆచార్యులు ఎందరో వారి వైభవాన్ని శ్రీసూక్తులుగా, స్తోత్రాలుగా వాంగ్మయ రూపంలో అందించారు. వారి అవతార విశేషాన్ని అనేక రకాలుగా విశ్లేషించారు. యతిరాజులను దర్శించి అనుభవించి కళ్యాణ గుణ పరంపరను ఎన్నో రకాలుగా వర్ణించారు. లోక హితైషి అయిన యతిరాజుల స్వరూప, స్వభావ దర్శనం, సిద్ధాంత దర్శనం వారి మహౌన్నత్యానికి నిదర్శనం!

మొదట శ్రీరామానుజాచార్యులు అవతరించగానే తండ్రి గారైన కేశవ సూరికి మేనమామ యగు తిరుమలనంబికి పరమపదనాథుని పంచాయుధాలుగా కనిపించారట! తల్లి అగు కాంతిమతి దేవికి ఆదిశేషుని అవతారంగా దర్శనమిచ్చాడట! కవితార్కిక కేసరి శ్రీ వేదాంత దేశికులు "విశ్వక్సేనో యతిపతి రభూత్ వేదసారః త్రిదండః" అని **(మిగతా 9 పేజీలో)**

# దర్శనం - నిదర్శనం

(6పేజీ తరువాయి) వర్ణిస్తారు. అనగా యతిరాజులు విశ్వక్సేనులు. వారి దండము విశ్వక్సేనుని హస్త దండము అని వర్ణిస్తారు. అలాగే వారు రచించిన "యతిరాజ సప్తతి" లో "అమునా తపనా తి శాయి భూమ్నా యతిరాజేన నిబద్ధ నాయక శ్రీ" అను ఈ శ్లోకంతో శ్రీ రామానుజాచార్యుల స్తుతి ద్వారా రహస్య త్రయాన్ని

( అష్టాక్షరీ, ద్వయ మంత్రం, చరమ శ్లోకం) సమన్వయిస్తూ వర్ణిస్తారు. అలాగే యతిరాజులకు త్రిదండ సమానులుగా భావింపబడే దాశరథి అను నామాహ్వాయులయిన మొదలి యాండాన్ "ధాటి పంచకం" అనే స్తుతి ద్వారా జగదాచార్యుల వైభవాన్ని త్రిదండ మహాత్మ్యాన్ని వర్ణిస్తారు.

శ్రీ రంగేశయ జయ ధ్వజః" అని శ్రీరంగనాథుని జయధ్వజులైన యతి రాజులకు "విజయతే" అని కీర్తిస్తారు. అవైదిక మత గజాలను అణచిన కంఠీరవం అని (సింహం) సర్పాలకు గరుత్మంతుని లాగా, అజ్ఞానాన్ని పారద్రోలే విద్యా చూడామణి లాగా యతిరాజుల గుణాలను దర్శించి స్తుతించారు.వీరిని రామానుజ పొన్నుడి అని కీర్తిస్తారు. అనగా శ్రీభగవద్ రామానుజాచార్యుల పాద స్వరూపులు.

ఆంధ్ర పూర్ణులు అను పేరు గల వడగ నంబి అనే వారు కూడా యతి రాజుల శిష్యులు. వీరి ఆచార్య నిష్ఠ చాలా గొప్పది. భగవంతుని కంటే ఆచార్యుల సేవయే పరమావధిగా భావించారు. వారు కూడా "శేషాంశకః కేశవ యజ్వ దేవ్యాం" అని యతిరాజులను శేషాంశ సంభూతునిగా స్తుతించారు.

ప్రపన్నగాయత్రిగా అనుసంధించే "ఇరామానుశనూత్తన్దాది" లో యతిరాజుల కళ్యాణ గుణాలను, దివ్య స్వరూపాన్ని తిరువరంగత్త అముదనార్లు స్తుతించారు. ఆచార్య వైభవాన్ని ప్రకాశింప చేసి, శ్రీ రామానుజాచార్యుల అవతార విశేషాలను గానం చేశారు.వారు అనేక రకాలుగా స్తుతిస్తూ పద్మావతీ విభుని చేతిలోని సుదర్శన, పాంచజన్య, నందక, కౌమోదకీ, శార్ఙ్గములనే పంచాయుధాలు అందరినీ ఉద్ధరించడానికి శ్రీ రామానుజాచార్యుల స్వరూపంతో వచ్చినట్లుగా దర్శిస్తూ ప్రార్థిస్తారు. శ్రీ మనవాళ మహామునుల ఆచార్యులైన తిరువాయ్ మొళి పెళ్లై (శ్రీశైలేశులు) అన్యమతస్తుల దుశ్చర్యలతో అస్తవ్యస్తమైన ఆల్వార్ తిరునగరిని ఉద్ధరించ సంకల్పించారు. చతుర్వేది మంగళం అనే వీధి నేర్పరచి ఆళ్వారుకు పునర్ వైభవాన్ని కలిగింప చేశారు. శ్రీ రామానుజాచార్యుల పూర్వపు అర్చామూర్తిని కూడా ప్రతిష్ఠించారు. ఆ సమయంలో వారి శిష్యులుగా ఉన్న మనవాళ మహామునులు "యతిరాజ వింశతి" అను స్తోత్రాన్ని రచించి భక్తితో పాడారట! అందుకే వరవరమునులకు వారి ఆచార్యులు "యతి రాజ ప్రవణులు" అనే బిరుదును ఇచ్చారట! వింశతి అనగా 20. ఆ సంఖ్యా నియతితోనే శ్రీ రామానుజాచార్యుల స్తుతి ఇందులో ఉంటుంది. ఆ శ్లోక రత్నాలు రహస్యత్రయి (అష్టాక్షరి, ద్వయమంత్రం, చరమశ్లోకం) సారంగా పెద్దలు భావిస్తారు. అష్టాక్షరి లో గల మూడు పదాలు, ద్వయ మంత్రం లో గల ఆరు పదాలు, గీతా చరమ శ్లోకం లో గల 11 పదాల సారాన్ని సమన్వయించి ఆచార్య స్తుతిగా ఇరవై సంఖ్యతో శ్లోకాలు రచించారనే రహస్యాన్ని పెద్దలు వివరిస్తారు. మంత్ర సారము ఆచార్య శరణాగతిని తెలియజేస్తుంది. ఆ ఆచార్యులు జగదాచార్యులయిన భగవద్ రామానుజాచార్యులు మాత్రమే! అని పెద్దల ఉపదేశము.

ఈ విధంగా ఎందరో పూర్వాచార్యులు భగవద్ రామానుజాచార్యులను వారి జీవన గమనం, ఆచరణ, ఉపదేశములు,స్వరూప స్వభావములు ఆధారంగా వారిని అవతారపురుషునిగా దర్శించారు. జగదాచార్యులకు ముందు ఆచార్యులు కూడా వారు అవతరించటానికి ముందుగానే భవిష్యత్ ఆచార్యులుగా వారి అర్చామూర్తిని ఆరాధించారు. యతిరాజుల వైభవాన్ని తర్వాతి తరాల వారందరూ కూడా అనుభవించి తరిస్తున్నారు. దివ్య దేశ చరిత్రల యందు, సంప్రదాయ ఆచరణలయందు, శ్రీ సిద్ధాంత నిరూపణల యందు, భాష్యకారుల శ్రీ సూక్తులు యందు, యతిరాజుల అర్చా మూర్తుల విశేషములందు వారి అవతార తత్వాన్ని అందరూ దర్శించవచ్చు!

అందరికీ భగవత్స్వరూపంగా గోచరించిన అవతార పురుషులు శ్రీభగవద్ రామానుజాచార్యులు. అతి సామాన్యులనూ ఉద్ధరించారు. సకల జీవరాశులను కూడా వాత్సల్యంతో చూశారు. విభేదాలు లేకుండా అందరిని తరింప చేశారు అనుటకు వారి చరిత్రే నిదర్శనం! యతిరాజులు భగవత్స్వరూపులే అనుటకు భగవంతుని స్వరూప గుణాలను తనయందు ప్రకాశింపజేసిన శ్రీ రామానుజ దివ్య దర్శనమే నిదర్శనం!




# మనసులోని మాట...

## ఆశ ఆశయం బాగుంది

శ్రీసన్నిధానం ఆశ ఆశయం బాగుంది. అనుక్షణం డబ్బు ఎలా సంపాదించుకోవాలి? ఎలా కూడబెట్టుకోవాలన్న తపన కలవారిని ఎందరినో చూస్తున్నాం. అన్నీ అందరికోసం... భారత జాతీయతకు తిరిగి ఉపిరి పోసేలా మీరు ట్రస్ట్ ద్వారా చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. మారుతున్న పరిస్థితులలో సెక్యులర్ భావాలు అంటూ జాతీయభావాలకు పరోక్షంగా వెన్నుపోటుపోడుస్తున్న వారి ఆటలు కట్టించాలంటే, స్వచ్ఛంద సంస్థలే ముందుకు రావాలి. బలహీన వర్గాలను ఆదుకోవాలి. మారుమూల ప్రాంతాలలో వైద్య సౌకర్యాల కల్పన చేయాలి. ప్రతిదీ వ్యాపారదృష్టి అలుముకున్న పరిస్థితులలో మేము ఉన్నామనే వారికి విదేశాలలో ఉండే మేము చేయూత నిస్తాం. ఏసంస్థ అయినా ప్రారంభించడానికి దానిని ఒక మార్గంలోకి తీసుకు రావడానికి సమయం, వ్యయ ప్రయాసలు తప్పనిసరి. అలుపులేకుండా మీ మా శ్రీసన్నిధానం ముందుకు వెళ్లడానికి ప్రచారం జరగాలి. ఆశయం నలుగురికి తెలియాలి.

-అర్చన, చందన, ఉత్తర అమెరికా

## మాసపత్రిక బాగుంది

శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాసపత్రిక బాగుంది. వైష్ణవతత్వము, యతిరాజవైభవము ఆధ్యాత్మిక వార్తలు బాలవిజ్ఞానము అన్నిటిని చక్కగా వివరించారు. ఈ పత్రిక శ్రీరామానుజులవారి అనుగ్రహముతో నిరాటంకముగా ముందుకు కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకంటున్నాను. జై రామానుజ

**-క్షమామణి, హైదరాబాద్**

## చక్కటి కథలను అందిస్తున్నారు.

చక్కటి కథలను అందిస్తున్నారు. పిల్లలకు,పెద్దలకు "సదాచారమే రక్ష" జేష్ఠ మాస ప్రాముఖ్యత అద్భుతంగా తెలియచేశారు

**-వసుంధర, వరంగల్**

## నలుగురు మెచ్చేలా...

అందరికీ నచ్చేలా శీర్షికలు, ప్రింట్ కాపీ ఉంటే బాగుండు అనిపించింది. పేర్లు నమోదు చేసుకున్నవారికి సభ్యత్వం తీసుకున్నవారికి ఉచితంగా అందిస్తున్న విషయం ఆనందం కలిగింది. నేను కూడా వివరాలు పంపుతాను.

**-కృష్ణమాచారి, గుట్ట**

### విదేశాలకు వెళ్లినా
# దేశసంస్కృతిని ఆచరించండి!!
### -దేవనాథ జీయర్ ఉద్బోధ



ఉన్నత విద్య కోసం భారత్ దేశాన్ని వదిలి, విదేశాలకు వెళ్ళాల్సి వచ్చినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను వదిలిపెట్టవద్దు అని శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయరు స్వామి ఉద్బోధించారు. చాతుర్మాస దీక్షలో భాగంగా ఆంధ్రాలో వేంచేసి ఉన్న జీయరు స్వామి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. విశాఖ శివారు ప్రాంతంలో గల విజ్ఞాన విహార



స్కూల్లో విద్యార్థులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేసారు.

త్రిదండి దేవ నాథ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణ లో విశాఖ బీచ్ రోడ్ లోని వారిజ ఆశ్రమం లో జరిగిన శ్రీ యాగం మహా పూర్ణాహుతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. జీయర్ స్వామివారి చాతుర్మాస్య దీక్ష లో భాగంగా గత నెల 29 నుంచి శ్రీ యాగం 27 రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. మహా పూర్ణాహుతి అనంతరం పెరుమాళ్ కు తిరు కళ్యాణం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక వార్తలు

భక్తులు తమ ఇష్టదైవానికి చెందిన బంగారు, వెండి, రాగి లాకెట్లను పొందేలా దేవా దాయ శాఖ తాజాగా ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధ ఆలయాల వద్ద వీటిని భక్తులకు అందుబాటులో ఉంచింది. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బంగారం లాకెట్లను, కొండగట్టు, బాసర, భద్రా చలం, ధర్మపురి, వేములవాడ, కొమురవెల్లి, వరంగల్ భద్రకాళి, కొరవి వీరభద్రస్వామి ఆలయాలు సహా రాష్ట్రంలోని 15 దేవాలయాల్లో వెండి, రాగి లాకెట్ లను అధికారులు విక్రయిస్తున్నారు. భక్తులు సమర్పించే బంగారు, వెండి కానుకలను కరిగించడం ద్వారా ఈ లాకెట్ ను రూపొందించి మూలస్వామివద్ద పూజించి అందిస్తున్నట్లు దేవాదాశాఖ ఇటీవల ప్రకటన విడుదల చేసింది.






## కరీంనగర్ మహాశక్తి ఆలయంలో
# సుదర్శన మహాయాగం

సుదర్శన పెరుమాండ్ల యొక్క తిరు నక్షత్ర మహోత్సవము పురస్కరించుకొని కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ఆగస్టు 4వ తేది ఉదయం నుండి అత్యంత వైభవంగా సుదర్శన మహాయాగం శ్రీమాన్ శ్రీ నమిలకొండ రమణాచార్యులు వారి ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము రక్షాబంధనము కలశస్థాపన నిర్వహించారు. అనంతరం సుదర్శన నరసింహ స్వామికి పాల పంచామృత అభిషేకము అష్టోత్తర పూజలు ,అగ్ని ప్రతిష్ఠ సుదర్శన లక్ష్మీనరసింహ హోమము వైభవంగా జరిగింది. సుదర్శన భగవానుని ఆరాధించిన వారికి సకల కార్య విజయాలు చేకూరుతాయని, మనోభీష్టం నెరవేరుతుందని, శత్రుబాధ నశిస్తుందని, రమణాచార్యులు ఉద్ఘాటించారు. మహాపూర్ణాహుతి సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వంశీ సంతోష్ శర్మ శ్రీనివాసు శర్మ మరియు పండితులు రామకృష్ణమాచార్యులు భరతాచార్యులు, వేద పండితులు ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.





## కనీవిని ఎరుగని రీతిలో స్వాతంత్ర్య ఉత్సవాలు

ఉభయ తెలుగు రాష్ట్రాలలోని శైవ, వైష్ణవ ఆలయాలలో 75వ ఉత్సవాలు నిర్వహించారు. కొన్ని ఆలయాలలో జెండాను స్వామి వారికిసమర్పించి పూజలు నిర్వహించిన తరవాత ఎగురవేశారు. మరికొన్ని ఆలయాల ఆవరణలో జెండాపండుగ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అన్ని పాఠశాలలో జెండా పండుగ నిర్వహించుకున్న విధంగానే కరీంనగర్ వేదభవనం ఆచార్యులు విద్యార్థులతో జెండా వందనం కార్యక్రమం నిర్వహించారు.




ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉన్న జీయర్ గురుకులములలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను నిర్వహించారు. గిరిజనుల కోసం నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపల్లిలోని జీయరు గురుకులంలో విద్యార్థులు, ఆచార్యులు వేడుకలలో పాల్గొన్నారు.

# ఉభయవేదాంత పండిత పరిషత్తు ఎన్నికలు

## అధ్యక్షులుగా కండ్ల కుంటవేంకటనరసింహా చార్య స్వామి, ఉపాధ్యక్షులుగా సేనాపతినిర్గుణాచార్య స్వామి





ఉభయవేదాంత పండితపరిషత్తు ఎన్నికలు ఇటీవల జరిగాయి. ఉభయవేదాంత పండితపరిషత్తు సర్వసభ్య సమావేశములో నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు ఉభయవేదాంత పండిత పరిషత్ ఒక ప్రకటనలో తెలిపింది. నూతన కార్యవర్గము ఎన్నుకునడానికి వీలుగా ఎన్నికల అధికారిగా శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య స్వామివారిని ఉభయవేదాంత పండిత పరిషత్ తీర్మానం ద్వారా నియమించింది.

శ్రీమాన్ ఆచి వేంకట పాండు రంగాచార్యస్వామివారి నేతృత్వంలో జరిగిన ఎన్నికలలో ఉభయవేదాంత పండిత పరిషత్తు అధ్యక్షులుగా శ్రీమాన్ కండ్ల కుంటవేంకటనరసింహా చార్య స్వామి, ఉపాధ్యక్షులుగా శ్రీమాన్ సేనాపతి నిర్గుణాచార్య స్వామి, కార్యదర్శిగా శ్రీమాన్ చించాపట్టణం జగన్ మోహనా చార్య స్వామి, సంయుక్త కార్యదర్శిగా న. చ. వేం. నరసింహాచార్య స్వామి, సంయుక్త కార్యదర్శిగా శ్రీమాన్ సుదర్శన శ్రీనాథా చార్యస్వామి, కోశాధికారిగా శ్రీమాన్ దరిపల్లి సురేశాచార్య స్వామి, కార్య నిర్వాహక సభ్యులుగా శ్రీమతి ధర్మపురి స్వర్ణ కుమారి శ్రీమాన్ అప్పన్ కందాడై శ్రీనివాసాచార్య స్వామి, గౌరవసలహాదారులుగా శ్రీ.ఉవేప. శ్రీమాన్ కందాడై రామానుజాచార్యస్వామి వారు, శ్రీ.ఉవేప.శ్రీమాన్ సిరిశిన ఘళ్ వేంకటాచార్య స్వామి వారు, శ్రీ. ఉవేప. శ్రీమాన్ అప్పన్ కందాడై పెరుమాళ్ళాచార్య స్వామివారు, శ్రీ.ఉవేప్ర. శ్రీమాన్ సుదర్శనం శ్రీనివాసాచార్య స్వామి వారు ఎన్నికైనారు.



అందరికీ సాదర స్వాగతం

## తిరుప్పావై శిక్షణ శిబిరం

### ఉభయ వేదాంత పండిత పరిషత్ భాగ్యనగరం

శ్రీ.ఉవేప. శ్రీమాన్ శిరిశినఘళ్ వేంకటాచార్యస్వామివారి అనుగ్రహపూర్వకతిరుప్పావై కాలక్షేప శిబిరంలో సేవించ గోరువారు, తమ, పూర్తిపేరు, తండ్రిగారిపేరు, వృత్తి, చిరునామా, సెల్ నంబర్లు, తది తరవివరములు ఈ దిగువ నంబర్లు గలవారిని ఎవరి నైనా, సంప్రదించ గలరని మనవి చేస్తున్నాము.

1.శ్రీమాన్ సేనాపతినిర్గుణా చార్యులు 8008746834.
2.శ్రీమాన్ చించాపట్టణం జగన్మోహనాచార్యులు. 9989888758.
3. శ్రీమాన్ దరిపల్లిసురేశ్ బాబుగారు. 9291325277.
4.N.C.V. నరసింహాచార్య. 9951585611. 6303063477.

# శమీక ముని సహనం, దయాగుణం

బాలవిజ్ఞానం

మన ఋషులు వారి పూర్తి జీవితాన్ని సత్యాన్వేషణకు, జ్ఞానం పొందడానికి, లోకక్షేమానికే అంకితం చేశారు. వారి తపస్సుకు ఆటంకాలు కలిగినా కష్టపడ్డారు కానీ సహనం కోల్పోలేదు అటువంటి గొప్ప సహనశీలి శమీక మహర్షి సహన గుణం దయాగుణం ఎలాంటివో నేటి కథలో తెలుసుకుందాం!

శమీక మహర్షి అంగీరసుడు అనే ఋషి సంతతి వాడు. ఈయన గొప్ప తపశ్శాలి. సహనం దయా గుణం కలవాడు. ఒకరోజు పరీక్షిత్తు మహారాజు వేటకు వెళ్లి జంతువులను పక్షులను వేటాడుతూ దప్పిక గొని శమీక మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. శమీకుడు తపస్సమాధిలో ఉన్నాడు. వేటలో అలసిన పరీక్షిత్తు దాహార్తితో చల్లని నీళ్లు కావాలని కోరాడు. కానీ మహర్షి లేవ లేదు. మహా రాజుననే గర్వంతో ఋషి పట్టించుకోలేదనే కోపంతో పరీక్షిత్తు మండిపడ్డాడు. అక్కడ పక్కనే చచ్చిపడి ఉన్న సర్పాన్ని ధ్యానంలో ఉన్న ఋషి మెడలో వేసి తన నగరానికి. వెళ్ళిపోయాడు



శమీక మహర్షి కుమారుడు శృంగి. అతను కూడా తపోనిష్ఠగలవాడే! ముని కుమారులు వెళ్లి ఈ విషయాన్ని అతనికి చెప్పారు. వెంటనే శృంగి శమీక ఆశ్రమానికి వచ్చి జరిగింది చూసి, చాలా చింతించాడు. ఆ మహాపరాధాన్నీ సహించలేక కారణమగు గర్వితుడైన పరీక్షిత్తు మహారాజును శపించాడు. ఆ సర్పాలకు మూలమైన తక్షక సర్పం యొక్క విష కాటుతో మరణించాలని శపించాడు. దుఃఖిస్తూ అక్కడే కూర్చున్నాడు ఆ అలికిడి విని లేచిన శమీకుడు సర్పాన్ని విసిరివేసి విషయాన్ని తెలుసుకున్నాడు పరీక్షిత్తు గురించి కుమారునికి తెలియచెప్పాడు తల్లి గర్భంలోనే మరణించిన పరీక్షిత్తు శ్రీకృష్ణ భగవానుని దయతో జన్మించాడు. శ్రీకృష్ణ నిర్యాణానంతరం అస్తవ్యస్తమై సంచరించు ప్రజలను చక్కగా పాలిస్తున్నాడు. ఆయన మరణిస్తే లోకానికి నష్టం కలుగుతుంది ఋషులు రాజులను రక్షిస్తే వారు ధర్మాన్ని నిలుప గలరు ధర్మం నిలబడితేనే లోక క్షేమం తపస్సు లక్ష్యం కూడా లోక క్షేమమే కదా అని మందలించాడు. భగవంతుని ప్రార్థించాడు. తన శిష్యుణ్ణి పిలిచి పరీక్షిత్తుకు శాప విషయం తెలియజేయుటకు పంపించాడు. పరీక్షిత్తు మహారాజు తన తప్పుకు పశ్చాత్తాపం పొంది శమీక మహర్షి సహనశీలతను మెచ్చుకున్నాడు. శపోపశమనం కోరి శ్రీశుక మహర్షి వలన మోక్ష మార్గాన్ని తెలుసుకున్నాడు. ఆ విధంగా శాప ఫలంతో తక్షకుని కాటుతో మరణించాడు శమీకుని సహనం వల్లనే పరీక్షిత్తు మోక్షమార్గం తెలుసుకోగలిగాడు.

**శమీకుని దయాగుణం**

కురుక్షేత్ర యుద్ధ సమయంలో అస్త్రప్రయోగాల వలన ఎందరో యుద్ధవీరులు మరణించుటే కాకుండా అడవిలో జీవరాసులు వృక్షాలు నాశనమయ్యాయి. ఆ సమయంలో శమీక మహర్షికి అడవిలో ఒక గంట కింద నాలుగు పక్షులు కనిపించాయి. గొప్ప తేజస్సు గల ఆ పక్షి పిల్లలను చూసి మునికి ఆశ్చర్యం కలిగింది. జీవితము మరణము అనేవి దైవసంకల్పం! ఇంత ఆపదలో కూడా ఇవి బ్రతికాయి కదా అనుకొని వాటిని కాపాడి పెంచాడు. అవి పెరిగి పెద్దవై మనుష్య భాషలో శమీక మహర్షికి కృతజ్ఞతలు తెలిపాయి. మనుషుల వలె మాట్లాడుతున్న ఆపక్షులను చూసి శమీకుడు మీరెవరు ఎలా మనుషుల్లా మాట్లాడగలుగుతున్నారు అని అడిగాడు. ఆ పక్షులు తమ పూర్వజన్మ వృత్తాంతం ఇలా తెలిపాయి. పూర్వం సుక్రుశుడు అనే ముని వుండేవాడు. పూర్వజన్మలో ఈ పక్షులు ఆయన కుమారులు. ఒకనాడు ఇంద్రుడు సుక్రుశని పరీక్షించడానికి ఆకలిగొన్న పక్షిలా వచ్చి ఆహారంగా మాంసాన్ని కోరాడు. అయితే మాంసాహారం ఇవ్వవలసి వచ్చినందుకు ఆ ముని బాధపడ్డాడు. అయినా తన నలుగురు కుమారులను ఆహారంగా ఇవ్వటానికి సిద్ధపడ్డాడు. కానీ ఆ కుమారులు నిరాకరించారు సుక్రుశుడు తానే ఆ పక్షికి ఆహారమై మళ్లీ ఇంద్రుని వరంతో బ్రతికాడు. కానీ తండ్రి కోపానికి గురి అయి ఆ మునికుమారులు పక్షులుగా జన్మించారు. సుక్రుశుణ్ణి వేడుకొని జ్ఞానాన్ని పొందగలిగారు. ఆ పక్షులను తన దయాగుణం తో శమీకుడు పెంచి పెద్దచేశాడు.

పక్షి రూపాల్లో ఉన్న ముని కుమారులు శమీకుని దయాగుణాన్ని పొగిడి నమస్కరించి వెళ్ళిపోయారు. శమీక మహర్షి సహన శీలుడు దయామూర్తి అని అందరూ ప్రశంసించారు.

జీయ్యర్ స్వాముల వెంట శ్రీసన్నిధానం గౌరవ సంపాదకులు, ఉభయ వేదాంత పండితులు శ్రీమాన్ అమరవాది వెంకట నర్సింహా చార్యులు స్వామి బదరీనాథ్‌కు వెళ్లి పెద్ద జీయర్ స్వామి విగ్రహ ఆవిష్కరణ ఘట్టంలో పాల్గొన్నారు. బదరీనాథ్ పర్యటన పూర్తిచేసుకుని తిరిగి ఏతెంచిన వారిని





నూతనంగా ఆవిష్కృతమైన శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్ సత్కరించింది. ట్రస్ట్ ఆశయాలను వారి ముందుంచింది. శ్రీసన్నిధానం ట్రస్ట్ వ్యవస్థాపకులు మేనేజింగ్ ఎడిటర్ డింగరి శ్రీనివాసమూర్తి, వొపీనియన్ ఎడిటర్ శ్రీమతి సముద్రాల శారద ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీసన్నిధానం తాజా సంచికను అందించి సమీక్షించారు.





# యాదాద్రి స్వామికి స్వర్ణ సింహాసనం

ఇక యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణోత్స వేడుకలు మరింత వైభవంగా నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణం నిర్వహించడానికి వీలుగా బంగారు సింహాసనం సిద్దంచేసి స్వామిని వేంచేపుచేశారు. తెలంగాణా తిరుపతిగా వాసికెక్కిన యాదాద్రిలో స్వామివారి నిత్యకల్యాణానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. సుమారు 18 లక్షల రూపాయల వ్యయంతో బంగారు పూతతో స్వామి వారిని స్వర్ణ సింహాసనాన్ని సిద్దంచేసి అధికారులు పూజలు నిర్వహించినట్లు బోగట్టా!! న్యూయార్క్‌కు చెందిన ప్రవాసభారతీయులు అభీష్టం మేరకు రూపొందించినట్లు తెలుస్తోంది.




